

గ్రామాల్లో రోడ్ల ఆధునికీకరణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-మామిడికుదురు

గ్రామీణ ప్రాంత రోడ్లకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. అప్పనపల్లి ఆర్ అండ్ బి రోడ్ నుండి బి.దొడ్డవరం ఆర్ అండ్ బి రోడ్డు వరకు సిసి రోడ్డు మరియు బిటి రోడ్డు కొరకు రూ.84 లక్షలు, మామిడి పాశర్లపూడి లంక నుండి ఆదుర్రు వరకు బిటి రోడ్డు కొరకు రూ.ఒక కోటి 41 లక్షలు వ్యయంతో బిటి రోడ్డు ఆధునికరణ పనులకు శనివారం ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అప్పనపల్లి గ్రామంలో గోదావరి వరదల్లో నది కోత ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. గ్రోయిన్లు నిర్మాణ పనులకు అవసరమైన నిధులు మంజూరు కోసం ప్రభుత్వము దృష్టి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు కసిరెడ్డి అంజిబాబు, బి.దొడ్డవరం సర్పంచ్ చెల్లుబోయిన రామకృష్ణ సుబ్రహ్మణ్యం, అప్పనపల్లి సర్పంచ్ గెద్దం మంగా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌కు 17బీచ్‌ల ఎంపిక

▸ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

కోస్టల్ జోన్ మాస్టర్ ప్రణాళిక పొందు పర్చేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని తీర ప్రాంతం వెంబడి 17బీచ్లను ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా టూరిజం కౌన్సిల్ అధ్యక్షులు హి మాన్షు శుక్లా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్ నందు జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, టూరిజం, పంచాయతీ అధికారులతో నిర్వహించారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధ నలకు లోబడి జిల్లాలోని తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలలోని బీచ్లపై అధికారులతో చర్చించారు. ముందుగా పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు, ఎపి టూరిజం కార్పొరేషన్ ఇడి వి.స్వామినాయుడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో 17 బీచులు పోస్టల్ రెగ్యులర్ జోన్ నిబంధనలకు లోబడి అభివద్ధికి అనువుగా ఉన్నాయని వివరించారు. వీటిలో


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కేశనపల్లి పడమటిపాలెం, చింతలమోరి నేచురల్, కేసుదాసుపాలెం, పారడైజ్, సెంట్ మేరీ పాఠశాల రోడ్డు అంతర్వేది-1 (పల్లి పాలెం), అంతర్వేది-2(దేవస్థానం), పల్లం, సిరయానం, సన్ రైజ్ సురసానియానం, వాసాలతిప్ప ఓడలరేవు, బివిసి కాలేజ్ బీచ్ తూర్పుపాలెం గుర్తించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కోస్టల్ రెగ్యులర్ జోన్ లో 17 బీచ్ లను ప్రతిపాదన లను కోస్టల్ రెగ్యులర్ జోన్ నోటిఫికేషన్ కింద ప్రజాప్రతినిధులు సమక్షంలో ఆమోదించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రతిపాదిత బీచ్ల వద్ద డిస్ట్రిక్ టూరిజం పోలీస్ స్టేషన్లో కొరకు భవన నిర్మాణాలను ప్రణాళికలో చేర్చాలని కమిటీకి సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలు, ప్రజాప్రతి నిధుల సూచనలను క్రోడీకరించి ఎపి టూరిజం అధారిటీ, సిఇఒకు నివేదిక పంపుతామని టూరిజం ఎగ్జిక్యూటివ్ సంచాలకులు స్వామి నాయుడు తెలిపారు. సమావేశంలో ప్రతిపాదిత బీచ్ల పరిధిలోని సర్పంచులు, స్థానిక సంస్థల అధికారులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, శాసన మండలి సభ్యులు బొమ్మి ఇశ్రాయెల్, ఆడా ఛైర్మన్ డేవిడ్ రాజు,రాజోలు శాసన సభ్యులు రాపాక వరప్రసాదరావు, పి.గన్నవరం శాసనసభ్యులు కె.చిట్టిబాబు, పర్యాటకశాఖ డివిజనల్ ఇంజనీర్ పవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజారావు ఆయా ప్రతిపాదిత బీచుల పరిధిలోని సర్పంచులు,పంచాయతీసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో 12 గంటల నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, వీరభద్రమ్ మాస్టర్లు నిరసన శిబిరానికి నాయకత్వం వహించారు. ఈ నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులు అందరూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జిఒ117 ని రద్దు చేయాలని ఆందోళన చేశారు. సత్తిబాబు మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగి హక్కు పాలకుల భిక్ష కాదని 80వ దశకంలో నే ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందన్నారు. కానీ పాలకులు మార్కెట్ శక్తుల కొమ్ము కాస్తూ సిపిఎస్ విధానం తీసుకువచ్చిందని పేర్కొన్నారు. జిఒ117 ని వెంటనే రద్దుచేసి ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి విద్యార్థికి- ఉపాధ్యాయునికి అనుసంధానం అయిన మంచి బోధనా విధానం ప్రవేశపెట్టి ఆచరణాత్మక విద్యను అభ్యసించే విధంగా విద్యాశాఖ మంత్రి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిరసనలో పాల్గొన్న సిఐటియు తదితర నాయకులు

సిఐటియు నాయకులు కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. నూతన విద్యావిధానం వలన ఉపాధ్యాయులకే కాదు ఎలిమెంటరీ విద్యార్ధులకు ప్రాణసంకటంగా మారిందన్నారు. ఫ్యాప్టో నిరసన ఉద్యమంతో ఆయినా ప్రభుత్వం దిగివచ్చి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఎఐటియుసి, సిఐటియుల నాయకత్వం ఉపాధ్యాయ ఉద్యమానికి వామపక్ష ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షక విద్యార్థి, మహిళా సంఘాలు మద్దతు ఉంటుందని ప్రకటించారు.

జాతీయ పతాకాన్ని ఎగురవేద్దాం..దేశభక్తిని చాటుదాం

ప్రజాశక్తి-రామచంద్రపురం

భారతీయ పౌరులైన ప్రతి ఒక్కరూ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకుందామని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. రామచంద్రాపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో తపాలా శాఖ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ కుమార్ ఎంపీ బోస్ కు జాతీయ పతాకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా జాతీయ పతాకాలను విక్రయిస్తుందని ప్రతి ఒక్కరూసద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ నాయకుల త్యాగాలను మరొక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ కుమార్


ఎంపీ బోస్‌కు జాతీయ జెండా అందజేస్తున్న దృశ్యం

మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ పతాకాలు ఈనెల 14వ తేదీ వరకు విక్రయించడం జరుగుతుందని వివరించారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గత 50 సంవత్సరాలుగా గ్రామానికి ఉన్న రెండు ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ విలసవిల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ సిఎం జగన్ ను అభ్యర్థించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లడతూ వైఎస్ఆర్ సున్నా వడ్డీ విడుదల చేసే కార్యక్రమానికి సిఎం జగన్ ఈ నెల11న అమలాపురం విచ్చేసిన సందర్భంగా సిఎం జగన్ ను సతీష్ కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. విలసవిల్లి-సమనస ఆర్ అండ్ బి రోడ్డు అధ్వానంగా ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలంలోని 17 గ్రామాలకు ప్రధాన రహదారి ఈ రహదారి కావడంతో రోడ్డు రద్దీగా మారి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.ఈ రహదారిపై నిత్యం పాఠశాలల కాలేజీల బస్సులు ప్రయాణిస్తుంటాయని ట్రాఫిక్ ఇబ్బందులతో విద్యార్థులు గమ్యస్థానం చేరుకునేందుకు ఆలస్యం అవుతుందని సిఎం జగన్ కు వివరించారు. అలాగే గ్రామపంచాయతీలోని శివారు గ్రామమైన గోకనవిల్లి కి రోడ్డు మురుగు కాలువపై వంతెన లేకపోవడంతో మూడు గ్రామాల మీదగా సుమారు ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణించి పంచాయతీ పనులకు గ్రామస్తులు రావలసి వస్తుందని తెలిపారు. గోకనవిల్లి నుండి విలసవిల్లి కి రోడ్డుతో పాటు వంతెన నిర్మించాలని సతీష్ కోరారు. సమస్యలు విన్న సిఎం జగన్ అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఈ సమస్యల విషయాన్ని అప్పగించినట్లు సతీష్ తెలిపారు.

గౌరవానికి భంగం కలిగితే రాజకీయాల్లోంచి తప్పుకుంటా

మంత్రి పినిపే విశ్వరూప్

ప్రజాశక్తి-అమలాపురం

సిఎం జగన్ అమలాపురం పర్యటన సందర్భంగా మంత్రి విశ్వరూప్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో సియం జగన్ తో పాటు మంత్రి ఫొటో లేకపోవడం, కేవలం ఆయన కుమారులు ఫొటో ఉండటంతో కొన్ని చానళ్లు తప్పుడు ప్రసారం చేయడంపై మంత్రి విశ్వరూప్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాతో పాటు నా ఇద్దరు కుమారులు రాజకీయాల్లో వున్నారు..మొత్తం ఫ్లెక్స్ లు నేనే వేయించాను.ఫ్లెక్స్ లో వాళ్ళ ఫొటో ఉండటం తప్పు కాదుకదా.దీనిపై మీడియా రాద్ధాంతం చేసింది. దానిని నేను ఖండిస్తున్నాను. అలాగే డ్వాక్రా మహిళలు ఫొటో తీసు కుంటుండగా ముఖ్యమంత్రి పిల వడంతో నేను వెళ్ళి అక్కడ కూర్చు న్నాను. జగన్ దళిత మంత్రిని అ వ మా ని ం చినట్లు మీడియా ప్రచారం చేసింది. దానిని కూడా ఖండిస్తున్నానని మంత్రి విశ్వరూప్ పేర్కొన్నారు.నా


మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

గౌరవం ఏమాత్రం తగ్గలేదు.అదే జరిగితే రాజకీయాల్లోంచి తప్పుకుంటా అని మంత్రి విశ్వరూప్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ ఉన్నారు.

మంత్రి రాజాను పరామర్శించిన ఎంపీ

ప్రజాశక్తి-అమలాపురం

మాతృవియోగంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ని శనివారం అమలాపురం పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధపరామర్శించారు. దాడిశెట్టిరాజా మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి బాబీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సిఎం జగన్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఎక్కడ చూసినా అరాచక పాలన సాగుతోందని టిడిపి మహాశక్తి చైతన్య రథయాత్ర మహిళలు విమర్శించారు. ఉప్పలగుప్తంలో శనివారం పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి టిడిపి మొదటి విడత మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

ఈకార్యక్రమంలో మాజీ ఎమ్ఎల్ఎ చిల్లా జగదీశ్వరి, మహిళా మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ మాకిరెడ్డి పూర్ణిమ, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు గెల్లా మీనాకుమారి,మద్దుల అను రాజేశ్వరి,పేరూరి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మురమళ్ళ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న వీరేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్ట్ కి శనివారం తాళ్లరేవు గ్రామానికి చెందిన విలుమూరి రామకష్ణ దంపతులు రూ.10వేలు ఆలయ పర్యవేక్షణాధికారి బి. వీరభద్రరావుకి అందజేశారు. ఆలయ ఛైర్మన్ పెన్మెత్స వాసురాజు, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించారు.

ధర్మకర్తల మండలిలో నాయీబ్రాహ్మణులకు స్థానం

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాలలో ధర్మకర్త ల మండలి సభ్యులుగా నాయీబ్రాహ్మణులకు పెద్ద పీట వేస్తూ సిఎం జగన్ ఉత్తర్వులు ఇచ్చారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆదేశాలు ప్రకారం మురమళ్ళ వీరేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యునిగా మురమళ్ళ గ్రామానికి చెందిన పోలవరపు వెంకట దాసు పేరును ప్రతిపాదన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని దేవస్థానం ఛైర్మన్ పెన్మత్స వాసురాజు శనివారం విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారులు ఉత్తర్వుల అనంతరం ప్రమాణస్వీకారం ఉంటుందని అన్నారు.

విద్యుత్ బిల్లులతో సామాన్యులు విలవిల

ప్రజాశక్తి-మండపేట

విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు విలలాడుతున్నారని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబుతో కలిసి ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రస్తుత విద్యుత్ బిల్లులు సామాన్య ప్రజలపై మూలగే నక్క మీద తాటిపండు పడినట్లు అన్న చందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో కరెంటు చార్జీలు ఏనాడూ పెంచిన పాపాన పోలేదన్నారు. వైసిపి ప్రభుత్వం గద్దె నెక్కాక ఇప్పటికి ఆరు సార్లు పెంచి పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందన్నారు. చంద్రబాబు పాలనలో అప్పటికే రాష్ట్రం విడిపోయి రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా సామాన్యునిపై భారం మోపలేదన్నారు. ఒక ఇంటికి రూ.800లు బిల్లు వస్తే ఆ చార్జీలు ఈ చార్జీలని చెప్పి మరో రూ.800 అధిక వసూలుకు పాల్పడుతున్నారన్నారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ బోర్డు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రూ.6500 గా మార్గదర్శకాలు ఇస్తే ఉత్తర ప్రదేశ్ మీటరుకు రూ.3,500, తమిళనాడు రూ.7,500 కు మీటర్లు కొనుగోలు చేసిందన్నారు. మన రాష్ట్రంలో మీటరుకు రూ.24 వేలు ఆదానీ కంపెనీలకు సిఎం జగన్ దోచి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

పెడుతున్నారన్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో వినియోగదారున్ని అన్ని రకాలుగా దోపిడీకి గురిచేస్తోందన్నారు. సమావేశంలో యరగతపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

16న మండపేటలో చంద్రబాబు పర్యటన

మండపేట నియోజకవర్గంలో ఈ నెల 16న టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పర్యటించనున్నారని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బిసిలతో ప్రత్యేకంగా సమావేశం అవుతారని అన్నారు. కార్యక్రమానికి సంబంధించి సభా ప్రాంగణం, సమయం త్వరలోనే వెల్లడిస్తామని ఆయన అన్నారు.

చిన్నారిని రక్షించిన పోలీసులకు రివార్డులు

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గౌతమి గోదావరి వంతెన పట్టుకుని వేలాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారిని రక్షించడంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ హైవే ఆలమూరు పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ నగదు రివార్డులను శనివారం అమలాపురం ఎస్పీ కార్యాలయంలో అందజేసి అభినందించారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం ఈనెల 6 తెల్లవారుజామున రావులపాలెం నుంచి జొన్నాడ వైపు వెళ్లే గౌతమి గోదావరి వంతెన పై ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారిని పోలీసులు కాపాడిన విషయం విదితమే. ఈ సంఘటనలో మండలంలోని జొన్నాడ అవుట్ పోస్ట్ హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది అయిన హెడ్ కానిస్టేబుల్


రివార్డు తీసుకుంటున్న ఆలమూరు పోలీసులు

ఎస్వివి.సత్యనారాయణ, హోంగార్డ్ వెన్నెటి సాయి కుమార్ పాల్గొని కీలక పాత్ర పోషించారు. దీంతో పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించేందుకు చేసే ప్రతి మంచి పనికి పోలీసులకు రివార్డులను అందజేస్తామని జిల్లా ఎస్పీ తెలియజేశారని ఎస్ఐ అన్నారు.ఈ సందర్భంగా ఆయనతో పాటుగా పలువురు ప్రముఖులు వారిని అభినందించారు.

కణితి తొలగింపు

ప్రజాశక్తి-అమలాపురం

అయినవిల్లికి చెందిన మహిళ కడుపులో నొప్పి,వాపుతో ఇటీవల అమలాపురం కిమ్స్‌లో చేరింది. ఆమెకు స్కానింగ్ చేసిన గైనకాలజిస్ట్ డా.వరద, ఆ మహిళ అండాశయంలో సుమారు 27 సెం. మీ. వ్యాసము గల పెద్ద కంతి ఉన్నట్లు, సర్జరీ చేసి కంతి తొలగించాలని తెలి పారు.సర్జరీ తరువాత ఆ మహిళ క్షేమంగా ఉన్నా రని, కోలుకుంటున్నారని, మూడు రోజుల వైద్య పర్యవేక్షణ అనంతరం ఇంటికి పంపుతారని తెలి పారు. వైద్య బృందాన్ని కిమ్స్ చైర్మన్ కెవివి.సత్య నారాయణ రాజు తదితరులు అభినందించారు..


చెరువు గట్టు పరిశుభ్రతలో సర్పంచ్ సుభాష్

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామాభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యమని జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి, సర్పంచ్ సంగిత సుభాష్ అన్నారు. పినపళ్ళలో ఆయన ఆధ్వర్యంలో గ్రామ ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటి శ్రమదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఊర చెరువుగట్టు ఇరువైపులా మొక్కలను నాటారు. అనంతరం వాటిని సంరక్షించే బాధ్యత మనందరి పైన ఉందని సుభాష్ తెలిపారు. అలాగే చెరువు గట్టు అభివృద్ధికి ఒక ప్రణాళిక సిద్ధం చేశానని అన్నారు. తొలుత చెరువును సుందరీకరణగా తీర్చిదిద్ది గ్రామ ప్రజలకు అవసరమగు వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు వంటి సౌకర్యాలు సమకూర్చి చెరువు అభివ'ద్ధి చేస్తానని సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యనమదల రాణి శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభి రామన్న, గ్రామ జనసేన అధ్యక్షులు నామల సుబ్బారావు, కొనగల ధనరాజు నాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతు సమస్యలపై సిఎంకు వినతి

ప్రజాశక్తి-అంబాజీపేట

సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులు ఆదుకునేందుకు త్వరలో ఏర్పాటు చేయనున్న కొబ్బరి కొనుగోలు కేంద్రాలు నిరంతరం తెరచి ఉండేలా చూడాలని అంబాజీపేట సొసైటీ చైర్‌పర్సన్ దొమ్మేటి సత్య మోహన్ ఈ నెల 11న


సిఎంకు రైతు సమస్యలు వివరిస్తున్న సత్యమోహన్(ఫైల్)

అమలాపురం విచ్చేసిన సిఎం జగన్‌కు విన్నవించారు. వివరాలను ఆయన శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కేంద్రాలు ఏర్పాటుకు ప్రస్తుత మార్కెట్లో ధరలలో స్థిరత్వం ఉండి రైతులకు మేలుజరుగుతుందన్నారు. రైతుల నుండి సొసైటీలు నేరుగా కొబ్బరికాయలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2004లో అప్పటి సిఎం వైఎస్ఆర్ కొబ్బరికాయలకు రూ.9ధరగా నిర్ణయించి కొబ్బరికాయలు కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారన్నారు. తమ సొసైటీ వద్ద రైతు విశ్రాంతి భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారన్నారు. ఈవిషయమై సిఎం జగన్ సానుకూలంగా స్పందించాలన్నారు.

టిడిపి నేత నాగేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఆలమూరు

పెద్దపళ్ల టిడిపి సీనియర్ నాయకులు, ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొడవర్తి నాగేశ్వరరావు గుండెపోటుతో కేరళలో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే నాగేశ్వరావు పార్థివదేహం పెద్దపళ్ల గ్రామంలోని ఆయన


నివాళి అర్పిస్తున్న సత్యానందరావు

నివాసానికి చేరడంతో శనివారం విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి బండారు సత్యానందరావు శనివారం వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

మోడరన్‌లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-రామచంద్రపురం

విద్యార్థు లకు చదువుతో పాటు ఆటవిడుపు ఉండాలనే ఉద్దేశ్యంతో ఇంటర్నేషనల్ యూత్ డే పురస్కరించుకొని శనివారం మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో మోడరన్ ఎక్స్‌ప్రెస్ పేరుతో



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లయన్ జివి.రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యం ఉంటే జీవితంలో ప్రతిదీ సాధ్యమే అని అన్నారు. కార్యక్రమానికి ఇటీవల దుబాయ్ లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన బుర్ర శివ సాయి వీరబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మోడరన్ ఫౌండేషన్ తరపున శివసాయినిక్రీడాయశస్వి పురస్కారంతో సత్కరించారు.ఈ అనంతరం మెరిట్ విద్యార్థులకుఅభినందన పురస్కారం అందజేసారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మోడరన్ ఇంటర్ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డిగ్రీ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్ వైస్ ప్రిన్సిపల్ పి.ప్రకాష్, మోడరన్ అకడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఆలమూరు

ఎఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థి నాయకులు చేపట్టిన రావులపాలెం నుంచి మండపేట బైక్ ర్యాలీలో భాగంగా రావులపాలెంలో మొదలై ఆలమూరు ప్రభుత్వ హాస్టల్ వద్దకు చేరుకొని హాస్టల్ నందు జిల్లా కో కన్వీనర్ వెంకట్ అధ్యక్షతన ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవికుమార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపైన ఎఐఎస్ఎఫ్ చేస్తున్నటువంటి పోరాటాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని వారు విద్యార్థులను కోరారు.

బిసి నాయకులపై వివక్ష తగదు

ప్రజాశక్తి -మామిడికుదురు

టిడిపిలో బిసి సామాజిక వర్గానికి చెందిన నాయకులపై వివక్ష తగదని టిడిపి మండల బిసి సెల్ సమావేశం పేర్కొంది. మామిడికుదురు బిసి


బిసి సెల్ టిడిపి మండల సమావేశంలో నేతలు

కమ్యూనిటీ హాల్ లో శనివారం మండల బిసి సెల్ అధ్యక్షులు కడలి నూక రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఇటీవలే మొగలికుదురు లో జరిగిన దేవాంగ సాధికారిక విస్తృత స్థాయి సమావేశంలో బిసి నాయకులపై పలువురు నేతలు ఉద్దేశపూర్వకంగానే వివక్ష చూపారని ఆరోపించారు. ఆ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ పట్ల సభా గౌరవం పాటించలేదని, ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీ లో ఫోటో ప్రచురించలేదని, వేదికపై సముచిత స్థానం కల్పించకపోవడం, శ్రీనివాస్‌ని కాదని పక్క మండలానికి చెందిన ఒక సామాజిక వర్గానికి చెందిన మండల శాఖ అధ్యక్షులు చే సభాధ్యక్షత వహించమని జెడ్పి మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆదేశించడం పట్ల బిసి సెల్ సమావేశం ఖండించిది. తమను అణగదొక్కాలని చూస్తున్న వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి బిసి నాయకులు నయినాల సత్యనారాయణ, మల్లాడి విష్ణు,కోలా రాంబాబు,కంచి విశ్వనాథం, కుడుపూడి సురేష్, పాటి గోవిందు,బొక్కా చిన్నా,రాయుడు శ్రీను,గుబ్బల నరసింహ శెట్టి, పెదసింగు లక్ష్మి నరసింహ స్వామీ, మామిడిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.3.59 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం కు శనివారం వివిధ టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,95,640, నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.63,435 మొత్తం రూ.3,59,075 ఆదాయం సమకూరినట్లు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 4,396 మంది స్వామి వారిని దర్శించుకోగా, 3,685 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

98 మందికి రక్తపరీక్షలు

ప్రజాశక్తి-అంబాజీపేట


అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్యాధికారి కెఎన్.శ్రీనివాస్ శనివారం హాస్టల్ సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని 98 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి సిహెచ్‌ఓ బి. అప్పారావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు పంచాయతీలో మెడ యునైటెడ్ హాస్పిటల్ అమలాపురం వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.వైదేహి, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ఎం.జాయ్ సన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఇసిజి చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో సేల్స్ హెడ్ పవన్ కుమార్, పిఆర్ఒలు అజయ్ కుమార్ భార్గవ్‌లు సేవలందించి సహకరించిన సర్పంచ్ గౌస్ మోహిద్దిన్, కార్యదర్శి పి.ఎస్.వి.ఎస్.ప్రసాద్, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



కల్తీ ఆహారంతో ఆరోగ్యం పాడై..
నకిలీ డాక్టర్ వద్దకు వెళ్లారు పిన్నీ..!!

సంక్షిప్త వార్తలు

నేరాలు ఘోరాలు

పంట కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం కామనగరువు పెట్రోల్ బంక్ సమీపంలోని పంట కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. మండలంలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన జంగా రామ్ కుమార్ (27) ఈ నెల 11న అమలాపురం ఊర్జ కంపెనీకి పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాత్రి రామ్‌కుమార్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అమలాపురం చుట్టుపక్కల వెతుకుతుండగా శనివారం మధ్యాహ్నం కామనగరువు పెట్రోల్ బంక్ ఎదురుగా పంట కాలువలో శవం ఉన్నట్లు తెలిసి వెళ్లి చూడగా రామ్ కుమార్‌దిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు వారు అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తగు చర్య నిమిత్తం తాలూకా పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అదుపుతప్పి కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి వ్యాన్ బోల్తా పడిన సంఘటన శనివారం రోడ్డు లంకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు నుంచి ఒక పార్సిల్ సర్వీస్ ఐసర్ వ్యాన్ కంటైనర్ రాజమండ్రి పార్సిల్ అన్లోడ్ చేసి తిరిగి హైదరాబాద్ వెళుతుండగా గోపాలపురం, దేవరపల్లి మండలం గొల్లగూడెం మధ్య వచ్చేసరికి రోడ్డు మలుపు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ పోలు విరిగిపోయింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందడంతో తాళ్ళరేవు పంచాయతీ గుత్తులవారి పాలెంలో విషాదం అలముకుంది. మండలంలోని తాళ్లరేవు గ్రామం ముత్యాలమ్మ గుడి సమీపంలో రెడ్డి వెంకట్రావు స్మారక భవనం వద్ద సచివాలయం-2 ఎదురుగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వాసంశెట్టి ప్రసాద్ (46) మరణించడంతో గుత్తులవారిపాలెం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రసాద్ సోదరుడు పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో అసువులు బాసాడని వాసంశెట్టి ప్రసాద్ తల్లిదండ్రులు నాగవేణి, వెంకటేశ్వర్లు బోరున గుండెలవిసేల రోదిస్తున్నారు.

ముగ్గురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మామిడికుదురు మండలం నగరం ఎస్ఐ జానీ బాషా పామర్రు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అవగా, రాయవరం ఎస్ఐ సురేష్‌ను నగరం స్టేషన్‌కు బదిలీ చేశారు. అమలాపురం విఆర్‌లో ఉన్న జి.నరేష్‌ను రాయవరం పిఎస్‌కు బదిలీ చేశారు.



పరామర్శిస్తున్న జ్యోతుల నెహ్రూ

పలువురిని పరామర్శించిన నెహ్రూ

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి, మల్లేపల్లి, జెడ్.రాగంపేట గ్రామాలకు చెందిన పలువురిని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. గండేపల్లి గ్రామానికి చెందిన నందం రాంబాబు ఇటీవల కాలుకి ఇన్ఫెక్షన్ కావడంతో వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన నక్క సూర్యనారాయణ, గద్దె రామచంద్ర రావు, పల్లి రాముడు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను మల్లేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పోతుల చక్రం, అదే గ్రామానికి చెందిన నట్టే పకీర్ ఇటీవలే మరణించడంతో వారి కుటుంబాన్ని, జెడ్ రాగం పేటకు చెందిన దేవరపల్లి అన్నవరం, అదే కుటుంబానికి చెందిన దేవరపల్లి ముత్యాలమ్మ ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతులమోహనరావు, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, వెలమాటి కాశి, కందుల కొండయ్య చౌదరి, ఇప్పర్ల బాబి, చాగంటి సత్యనారాయణ మూర్తి, వెంపాటి రాజు, ఇప్పర్ల సురేష్, పైలా వెంకన్న, ఉప్పలపాటి సత్తిబాబు, ఉండవల్లి వరప్రసాద్, కురుకూరి శ్రీనివాస్, వెంపాటి సతీష్, కన్నబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గడపగడపకూ..

ప్రజాశక్తి-పెదపూడి

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లల మామిడాడలో శనివారం మూడోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాల ఒరవడిని కొనసాగిస్తు న్నారన్నారు. అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపిపి ద్వారంపూడి పద్మ వెంకట్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి (హంస), ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, లయన్స్ క్లబ్ శ్రీ సూర్య అధ్యక్షులు కడిమి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతల పరామర్శలు.. ప్రజల నిరసనలు..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పర్యటించిన ముఖ్యనేతల పర్యటనలు ఆద్యంతం ఆత్మస్తుతి... పరనిందలకే పరిమితం అయ్యాయి. గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్షనేత నారా చంద్రబాబు రెండు రోజుల పాటు వేర్వేరుగా జిల్లాలో పర్యటించిన విషయం విదితమే. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయంచని కేంద్ర ప్రభుత్వంపై ఒక్క విమర్శ కూడా చేయకపోవటం ప్రజలను విస్మయానికి గురి చేసింది. మణిపూర్‌లో జరిగిన ఘోరాలకు నిరసనగా పార్లమెంటులో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాణానికి సైతం ఎన్‌డిఎకు మద్దతు తెలపటం విశ్వసనీయతకు దర్పణం పట్టింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి కోనసీమలో రక్షణ గోడలు నిర్మిస్తామని ఇచ్చినహామీపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాలుగేళ్లుగా ఏమిచేశారనే ప్రశ్న తలెత్తుతోంది. గతేడాది చేపట్టిన పర్యటనలో ఏటిగట్లు పటిష్టం చేస్తామని ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మిగిలాయి. దీంతో తాజా హామీనైనా నిలబెట్టుకోకుంటే రాబోయే ఎన్నికల్లో పరాభావం తప్పదని వరద బాధితులు మండిపడుతున్నారు. మరో వైపు చంద్రబాబు నిర్వహించిన దేవరపల్లి, కోరుకొండ సభలలో ప్రజలపై వరాల జల్లు కురిపించారు. ప్రధానంగా రాజానగరం ఎంఎల్ఎపై చేసిన విమర్శలు జిల్లాలో చర్చనీయాంశం అయ్యాయి. సాగునీటి ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును ప్రశ్నించకపోవటం పారదర్శకతను ప్రశ్నిస్తోంది. ఇరువురి పర్యటనలు ఎన్నికలే లక్ష్యంగా చేస్తున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఒక వైపు విద్యుత్ బిల్లులు... మరో వైపు కోతలు

విద్యుత్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నడ్డి విరుస్తోందంటూ వినియోగదారులు వాపోతున్నారు. వినియోగపు ఛార్జీలకు రెట్టింపుగా బిల్లులు జారీ చేయటం విమర్శలకు దారి తీస్తోంది. విద్యుత్ సంస్థలకు సర్ ఛార్జీలు వసూళ్ల చేసేందుకు అవకాశం కల్పించిన విషయం విదితమే. దీంతో వివిధ రకాల పేర్లతో వసూళ్లకు సంస్థ తెరలేపింది. గతంలో నెలకు 450 వచ్చే వారికి సైతం గత రెండు నెలలకు రూ.700పైగా బిల్లులు జారీ చేసినట్లు తెలుస్తోంది. వినియోగపు యూనిట్లు యథాతథంగా ఉన్నప్పటికీ అదనపు ఛార్జీలు విధించటంతో బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయని వాపోతున్నారు. మరో వైపు విద్యుత్ కోతలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గడచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవటంతో రొటేషన్ పద్ధతిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జవాబివ్వటం విస్తుగొలుపుతోంది. రోజుకు గంట నుంచి 2 గంటలకు పైగా విద్యుత్ కోతలు విధించటం ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రభుత్వం చొరవ చూపి ఛార్జీల భారం తగ్గించాలని అదే విధంగా నాణ్యతతో కూడిన సరఫరా చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

కేంద్ర కార్మిక సంఘాల ఆందోళన బాట

క్విట్ ఇండియా స్ఫూర్తితో మోడీ ప్రభుత్వంపై కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిన్నంటాయి. కాకినాడలో కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నేతలను అక్రమ అరెస్టులు చేయటం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పౌరహక్కులను హరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ఐక్యంగా చేపట్టిన ఆందోళనలకు వందలాది మంది తరలి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నిరసనలు హోరెత్తాయి. గడచిన 9 సంవత్సరాలలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం వినాశకర ఆర్థిక విధానాలనే అవలంభించిందని కార్మిక సంఘాల ప్రతనిధులు మండిపడ్డారు .రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దిగొచ్చిన టమోటా

టమోటా ధరలు తగ్గడంతో సామాన్య ప్రజలకు కొంత ఊరట లభించింది. బహిరంగ మార్కెట్లో కేజీ టమోటా రూ.60 కాగా రైతు బజార్లలో రూ.40 చొప్పున అందుబాటులోకి వచ్చాయి. గత నెల రోజులుగా కేజీ రూ.200 నుంచి రూ.220 వరకూ విక్రయాలు జరిగిన విషయం విదితమే. చికెన్ ధరలతో సైతం టమోటాలు పోటీ పడటం ఇదే తొలసారని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు దిగిరావటంతో కొనుగోలు దారులతో పాటు వ్యాపారులకు ఊరట లభించింది.

యానాం వార్తలు

బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు తగిన గుర్తింపునిచ్చేందుకు ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం మహిళా శిశుఅభివద్ధి మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును అందజేస్తుందని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు ఉన్న చిన్నారులు https://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఢిల్లీలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం ఉంటుందన్నారు.

యానాంకు మంత్రి లక్ష్మీనారాయణ రాక

ప్రజాశక్తి - యానాం

ఆగస్టు 15న స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జాతీయ పతాకాన్ని ఎగురువేసేందుకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ రానున్నట్లు శనివారం ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు.

పోలీస్ కవాతుకు రిహార్సల్స్

ప్రజాశక్తి - యానాం




రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆగస్టు 15వ తేదీన నిర్వహించే పోలీస్ కవాతు కోసం రిహార్సల్స్ చేస్తున్నారు. ఎస్‌పి రఘునాయిగం, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి పోలీస్ కవాతు సాధనను పరిశీలించి పోలీసులకు సూచనలు ఇస్తున్నారు.

లయన్స్ విజన్ ఆధ్వర్యంలో సీమంతాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



సీమంతాలు చేస్తున్న సభ్యులు

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం పండుగ వాతావరణంలో సీమంతాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ గర్భవతులకు సీమంతాలు జరిపే ఆచారం అనాదిగా ఉందన్నారు. అమ్మకు, అమ్మతనానికి ఇచ్చే గౌరవం మన దేశ సంస్కృతిలో మరింత ఎక్కువ కాబట్టి సామూహికంగా సీమంతలు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనివలన గర్భిణులకు మానసిక భరోసా కలుగుతుందన్నారు. శారీరిక, మానసిక ఆరోగ్య భద్రతతో కూడిన భరోసాను కల్పించేందుకు సీమంతాలు దోహదపడతాయన్నారు. తల్లి మానసిక ఆనందం పుట్టబోయే బిడ్డ మానసిక ఆరోగ్య మీద ప్రభావం చూపుతుంది కాబట్టి ఎప్పుడు ప్రశాంతంగా ఉండాలని ప్రసున తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ శ్రీరామ్ గణేష్ ప్రసాద్, ఎన్.శ్రీదేవి రెడ్డి, బి.వాణి, రమా సుందరి, శ్రీవాణి, డాక్టర్ శిరీష, అడబాల రత్న ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై ఉద్యోగుల హర్షం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పని చేస్తున్న 4,569 మంది ఉద్యోగులకు 23 శాతం జీతం పెంచుతూ ప్రభుత్వం జిఒ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సిఎం వైఎస్.జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఉద్యోగులు మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి సెర్ప్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.ధనుంజయరెడ్డి మాట్లాడారు. సెర్ప్ ఉద్యోగుల కష్టాన్ని గుర్తించి జీతం పెంపుదల చేయడంపై సిఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వై.శ్రీరమణి, ఎల్ 4 సంఘం అధ్యక్షులు తోట అశోక్ భరత్, ఎల్ 3 సంఘం అధ్యక్షులు పుప్పాల సూర్యనారాయణ, డిపిఎం బాబూరావు, ఎపిఎం బి.ప్రశాంతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు అనంత లక్ష్మి

రాష్ట్రంలోని నిరుపేదలను సంపన్నులను చేయడమే టిడిపి అధినేత చంద్రబాబు ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలపరిధిలోని ఇంద్రపాలెంలో శనివారం నిర్వహించిన 'మహాశక్తి-భవిష్యత్తు గ్యారెంటీ'లో భాగంగా 'వస్తున్నా- మీ గ్రామానికి- మీ అనంతలక్ష్మీ' 26వ రోజు కార్యక్రమం నిర్వహించారు. తెలుగు మహిళలు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకంపై వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ జలగలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చేది పైసా, జేబులో వేసుకునేది వంద రూపాయలు అనేలా సంక్షేమ పథకాల అమలు తీరు ఉందన్నారు. గ్రామస్వరాజ్యాన్ని తీసుకు వచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబు అయితే ఆ గ్రామస్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసింది జగన్ అని ధ్వజమెత్తారు. పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులకు రూపాయి ఖర్చుపెట్టింది లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు భరోసా అని అన్నారు. పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం చంద్రబాబు మినీ మ్యానిఫెస్టోను ప్రకటించారన్నారు. సంపద ఎలా సృష్టించాలో తెలిసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహనరెడ్డి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. మన రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు వంటి నాయకులను ఆదరించాలన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, మీ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబును ఆదరించి గెలిపించాలని అనంతలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిదే నాగ హరినాథ్, నాయకులు పండూరి జయకృష్ణ, మరుకుర్తి నాగబాబు, పంపన బుజ్జి, పుల్లయ్య శ్రీను, టేకుమూడి శ్రీను, కాకరపల్లి మోహన్ రావు, బొజ్జ భవాని సాంబశివరావు, కొమిరిశెట్టి నర్సింగరావు, దొమ్మేటి వెంకటరమణ, కింతాడ శేఖర్, గుబ్బల సత్తిబాబు, గొల్లపల్లి లక్ష్మి, పిల్లి శ్రీధర్, చల్మాజీ, పెంకే వీరబాబు, కొల్లుబోయిన అచ్యుత్, టేకుమూడి శ్రీనివాస్, చాట్రాతి సాయిబాబా, పలివెల గాయత్రి, పిల్లి విజయ్ గోపాల్, కందర్ప సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితో అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి


ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని రాజపూడిలో శనివారం మహాశక్తి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం నెహ్రూ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చట్టం చెయ్యడంతో ఆంధ్రప్రదేశ్ మహిళల గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిరన్నారు. మహిళలకు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి ఆర్థిక పరిపుష్టి సాధించిన నాయకుడు చంద్రబాబు అన్నారు. చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇచ్చి వారిని సగర్వంగా తిరిగేలా చేసిన నాయకుడు చంద్రబాబు అన్నారు. 2014 నుండి 2019 వరకు మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకు వచ్చి అభివద్ధి పరిచారన్నారు. చంద్రబాబు ఆడబిడ్డకు పెళ్లి కానుకను ఇస్తే వైసిపి ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసిందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మహిళలను ఆర్థికంగా కుంగదీసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోలినాటిధర్మానందకుమారి, నకిరెడ్డి సూర్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ



మండలంలోని బలభద్రపురంలో ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రజలకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎస్‌పి ఎస్‌పి సతీష్ ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రాత్రి సమయంలో ఆరుబయట లేదా మేడపైన నిద్రించేవారు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వివాహాది శుభకార్యాలకు, వ్యక్తిగత పనులు నిమిత్తం ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా వెళ్లేవారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. రాజపూడి గ్రామ పరిధిలో పీస్ కమిటీని నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మరోతి శివగణేష్, సిదిరి సత్తిబాబు, యర్ర రామకృష్ణ, పప్పల అప్పలరాజు పాల్గొన్నారు.